గెలుపోటములు సహజం : డీఈవో



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 28: పోటీల్లో గెలుపోటములు సహజమని, వాటిని సమానంగా తీసుకోవాలి డీఈవో మామిడి జ్ఞానేశ్వర్ సూచించారు. బుధవారం శంభునిపేట ప్రభుత్వ పాఠశాలలో వారధి ఫౌండేషన్, విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ... విద్యతోపాటు సాంస్కృతిక అంశాలపై పట్టు సాధించేందుకు ఇలాంటి పోటీలు దోహదపడుతాయన్నారు. వ్యాసరచన పోటీల్లో ఎ.సాత్విక(ఉప్పరపల్లి), డి.అక్షత ప్రథమ, ఉపన్యాస పోటీల్లో సీహెచ్. శ్రీజ, ఎస్. సాహితి, బి. సాత్విక (నెక్కొండ) ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరితోపాటు ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు డీఈవో నగదు పారితోషికంతోపాటు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో డీఎస్‌వో డాక్టర్ కట్ల శ్రీనివాస్, పాఠశాల హెడ్మాస్టర్ శారదబాయి, నాగేశ్వర్‌రావు, అనుపమ, రవికుమార్, సురేష్‌బాబు, శ్రీనివాస్, రమేష్, పి. బాలాజీరావు, జి.సుందర్ పాల్గొన్నారు.

రేపు 'దేవాదుల'కు మంత్రి ఉత్తమ్ రాక



ములుగు, ఆగస్టు 28: సాగునీటి ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ములుగు జిల్లాకు రానున్నారు. కన్నాయిగూడెం మండలంలోని దేవాదుల ప్రాజెక్టు పంప్‌హౌస్, తుపాలకుగూడెంలోని సమ్మక్క బ్యారేజీని సందర్శిస్తారు. ఉదయం 9 గంటలకు దేవాదులకు హెలికాప్టర్ ద్వారా చేరుకోనున్న మంత్రి ఈ రెండు ప్రాజెక్టులను పరిశీలించిన తర్వాత సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమై పలు అంశాలను సమీక్షిస్తారు. మధ్యాహ్నం 12గంటలకు తిరుగు ప్రయాణమవుతారు. మంత్రి పర్యటన కోసం జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.



హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, వేదికపై మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, కలెక్టర్లు, అధికారులు

సుస్థిరాభివృద్ధిపై దృష్టి పెట్టాలి


భద్రకాళి దేవాలయంలో గవర్నర్ పూజలు


వేయి స్తంభాల దేవాలయంలో..

- అప్పుడే అసలైన ప్రగతి సాధ్యం
- వ్యవసాయంలో సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్సహించాలి
- మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి
- ఎస్‌హెచ్‌జీలను బలోపేతం చేయాలి
- ఓరుగల్లు విశిష్టమైన నగరం
- కాకతీయుల కట్టడాల సందర్శనతో దివ్యానుభూతి
- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- నగరంలో విస్తృత పర్యటన
- కలెక్టరేట్‌లో అధికారులు, కవులు, కళాకారులతో భేటీ
- సంక్షేమ పథకాల అమలుపై ఆరా
- హాజరైన మంత్రులు పొంగులేటి, సీతక్క పొన్నం ప్రభాకర్


'రెడ్‌క్రాస్'లో తలసేమియా బ్లాక్‌ను ప్రారంభిస్తున్న గవర్నర్

హనుమకొండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల అమలుతో పాటు సుస్థిరాభివృద్ధిపై దృష్టి పెట్టాలని అప్పుడే అసలైన ప్రగతి సాధ్యమవుతుందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. మూడురోజుల ఉమ్మడిజిల్లా పర్యటనలో భాగంగా రెండో రోజు బుధవారం హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో విస్తృతంగా పర్యటించారు. మంగళవారం ములుగు, జయశంకర్‌భూపాలపల్లి జిల్లాల్లో పర్యటించిన ఆయన లక్నవరం టూరిజం కాటేజీలో బస చేశారు. బుధవారం ఉదయం అక్కడి నుంచి హనుమకొండ చేరుకుని.. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హనుమకొండ కలెక్టరేట్‌లో అధికారులు, కవులు, రచయితలు, కళాకారులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో భేటీ అయ్యారు. వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ తిలకించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని, అది సుస్థిరమైనప్పుడే ఆశించిన ఫలితాలు దక్కుతాయని, ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయన్నారు. అధికారుల కర్తవ్య నిర్వహణ ఈ దృష్టి కోణం నుంచే జరగాలని ఉద్బోధించారు. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవడం, జలవనరులను కాపాడుకోవడం, వ్యర్థాల నుంచి పునరుత్పాదకత సాధన, ఇంధన వనరుల పొదుపు వాడకం వంటి వాటి ద్వారా సుస్థిరాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సేంద్రియ వ్యవసాయంపై ప్రధానంగా దృష్టి సారించాలని కోరారు. పీఎం కుసుమ్ యోజన పథకం గురించి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో సౌరవిద్యుత్ వాడకాన్ని ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ఈ పథకం అమలు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎలా జరుగుతోందని ఆరా తీశారు. అందుకు కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ఈ పథకం అమలుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నీటిపారుదల రంగంలో సౌరవిద్యుత్ వాడకాన్ని పెంచాలని గవర్నర్ జిష్ణు దేవ్ కోరారు. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇస్తోందని, ఈ క్రమంలో విద్యుత్ వాడక భారాన్ని తగ్గించేందుకు రైతులు కుసుమ్ యోజన పథకం కింద సౌర విద్యుత్ కనెక్షన్లను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ)ను బలోపేతం చేసే దిశగా కృషి జరగాలని గవర్నర్ సూచించారు. ఎస్‌హెచ్‌జీలను మరింత క్రియాశీలకంగా మార్చడం స్వచ్ఛభారత్‌లాగా ఒక ఉద్యమంలాగా సాగాలన్నారు. కొన్ని ఈ కామర్స్ సంస్థల వల్ల ఎస్‌హెచ్‌జీ ఉత్పత్తులు మార్కెట్‌లో పోటీని తట్టుకొని నిలబడలేకపోతున్నాయని, ఈ క్రమంలో ఎస్‌హెచ్‌జీ ఉత్పత్తుల మార్కెట్ విస్తరణకు ప్రత్యేక చర్యలు తీసుకోవలసి ఉందన్నారు. ఈ క్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌హెచ్‌జీల ఉత్పత్తుల విక్రయానికి హైదరాబాద్‌లో ఒక విశాలమైన మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకొస్తోందని గవర్నర్‌కు వివరించారు.

అభివృద్ధిపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్

వరంగల్, హనుమకొండ కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, ప్రావీణ్య.. రెండు జిల్లాల అభివృద్ధికి చేపడుతున్న చర్యలు, జరుగుతున్న పనులు, విద్య, వైద్యం, ఎంజీఎం ఆస్పత్రి అభివృద్ధి, ఐసీడీఎస్, వ్యవసాయం, ఏనుమాముల మార్కెట్ తదితర శాఖల గురించిన వివరాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అంగన్వాడీ కేంద్రాల ఉన్నతీకరణ విధానం, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, దేవాలయాలు, పర్యాటక ప్రదేశాలు, జాతీయ రహదారులు, స్మార్ట్ సిటీ పనులు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, విపత్తుల నిర్వహణ, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ప్రతిపాదిత కూరగాయల మార్కెట్లు, పారిశుధ్య

మిగతా 7వ పేజీలో..


కోటలో పేరిణీ నృత్య ప్రదర్శనను తిలకిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

మార్కెట్‌కు కొత్త మక్కలు


మక్కలు అమ్మకానికి తీసుకువచ్చిన రైతు రవిందర్

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 28: ఏనుమాముల(వరంగల్) వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం కొత్త మక్కలు అమ్మకానికి వచ్చాయి. ఈ సీజనల్‌లో కొత్త మక్కలు రావడం ఇదే తొలిసారి. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం రాజేశ్వర్‌రావుపల్లికి చెందిన పెద్దపెల్లి రవిందర్ 30 బస్తాలు అమ్మకానికి తీసుకువచ్చాడు. దివ్యజ్యోతి అడ్తి ద్వారా వెంకటరమణ ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకులు క్వింటాకు రూ.2,905 చొప్పున ఖరీదు చేశారు. సాధారణంగా కొత్త మక్కలు సెప్టెంబరు రెండో వారంలో అమ్మకానికి వస్తుంటాయి. కానీ, పక్షం రోజుల ముందే అమ్మకానికి వచ్చింది.

పెరిగిన మక్కల ధరలు

వరంగల్(ఏనుమాముల) వ్యవసాయ మార్కెట్లో బుధవారం మక్కలకు మంచి ధర పలికింది. మార్కెట్ చరిత్రలోనే క్వింటా రూ.2,911 ధర పలికింది. సంగెం మండలం బాలునాయక్ తండాకు చెందిన బానోతు ధన్‌సింగ్ 22 బస్తాల మక్కలు అమ్మకానికి తీసుకురాగా సురేష్ ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకులు కొనుగోలు చేశారు.

తెలుగు వర్సిటీకి పాల్కురికి పేరు పెట్టాలి

- తెలంగాణ ఆదికవికి పట్టం కట్టడం చారిత్రక అవ సరం
- సాహిత్యంలో బహుజనులకు స్థానం కల్పించింది సోమనాథుడే
- సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్న సాహితీ వేత్తలు, కవులు

వివరాలు 7వ పేజీలో...

రైస్ మిల్లర్ల మాయాజాలం

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 28: జిల్లాలో రైస్ మిల్లర్ల మాయాజాలంతో సీఎంఆర్(కస్టమ్ మిల్డ్ రైస్) లక్ష్యం చేరడం లేదు. నిర్దేశిత లక్ష్యాలను సాధించడంలో రైస్ మిల్లర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారని, వారితో అధికారులు కుమ్మక్కై సీఎంఆర్ ఇవ్వని మిల్లర్లపై చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినివస్తున్నాయి. గడువు ముగిసే లోపు కనీసం సగం సీఎంఆర్ ప్రభుత్వానికి అందజేయడం లేదనే విమర్శలున్నాయి. జిల్లాలో 100కుపైగా రైస్ మిల్లర్లకు సీఎంఆర్ ఇస్తుంటే అందులో నాలుగైదు మిల్లర్లు ప్రతీ ఏడాది ప్రభుత్వానికి అప్పగించాల్సిన సీఎంఆర్ ఇవ్వడం లేదు. మిల్లర్లతో కుమ్మక్కవుతున్న అధికారులు తూతూమంత్రంగా కేసులు నమోదు చేయిస్తూ చేతులు దులుపుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. నాలుగైదేళ్ల నుంచి ఇదే నిరక్ష్యం కొనసాగుతోంది. ఏటా నిర్దేశిత సీఎంఆర్ ఇవ్వాల్సిందిగా వారికి లక్ష్యాలను పెట్టి అధికారుల వరి ధాన్యం అందిస్తున్నారు. సుమారుగా 100రైస్ మిల్లర్లకు ధాన్యం అందించి, లక్ష్యం మేరకు సీఎంఆర్ అందించాలని అధికారులు సూచనప్రాయంగా చెబుతున్నారే తప్ప అధికారికంగా చెప్పడం లేదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సీఎంఆర్ రైస్ అందించని మిల్లర్లపై అధికారుల నామమాత్రపు కేసులు పెడుతున్నారు. గతంలో లక్ష్యాన్ని చేరని మిల్లర్లకు సైతం మళ్లీ సీఎంఆర్‌ను ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది. సంవత్సరానికి నాలుగు నుంచి అయిదు కేసులే అధికారుల చేయిస్తుండటంపై విమర్శ లు వ్యక్తమవుతున్నాయి. లక్ష్యం చేరని మిల్లులను సీజ్ చేయాల్సిన అధి కారులు, కేసులతో సరిపుచ్చుతూ చేతులు దులుపుకుంటున్నారు. నిరంత రం తనిఖీలు లేకపోవడంతో మిల్లర్ల నిర్లక్ష్యానికి కారణమనే ప్రచారముంది.

పీడీఎస్ బియ్యాన్నిస్తున్న మిల్లర్లు

ప్రభుత్వం రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని మిల్లర్లకు అందజేసి వాటి నుంచే నిర్దేశిత లక్ష్యాల ప్రకారం సీఎంఆర్‌ను ఇవ్వాలని చెబుతున్నారు. అయితే అందుకు భిన్నంగా ధాన్యం బదులుగా పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేస్తూ వాటినే సీఎంఆర్ కింద ప్రభుత్వానికి అందజేస్తున్నారు. ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుందనే ఆరోపణలున్నాయి.

ప్రేమ వివాహానికి అడ్డుచెప్పడంతో
యువకుడి ఆత్మహత్య
సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియో వైరల్


జయంతికుమార్ (ఫైల్)

నెక్కొండ, ఆగస్టు 28 : ఉద్యోగం వచ్చాకే ప్రేమించిన యువతితో వివాహం జరిపిస్తామని తల్లిదండ్రులు స్పష్టం చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం నెక్కొండ మండలంలో జరిగింది. అయితే యువకుడు పురుగుల మందు తాగుతూ తీసుకున్న సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నెక్కొండ ఎస్ఐ మహేందర్, మృతుడి కుటుంబీకుల తెలిపిన వివరాల ప్రకారం.. నెక్కొండకు చెందిన చింతల తిరుపతి-యశోద దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కుమారుడు చింతల జయంతికుమార్ (22) ఇటీవల ఐటీఐ పూర్తిచేసి, హైదరాబాద్‌లో అప్రెంటిషిప్ చేస్తున్నాడు. ఈ క్రమంలో తాను ప్రేమించిన యువతితో వివాహం జరిపించాలని తరచూ జయంతికుమార్ తల్లిదండ్రులతో గొడవ పడుతుండేవాడు. అయితే ఉద్యోగం వచ్చిన వెంటనే వివాహం జరిపిస్తామని తల్లిదండ్రులు తేల్చి చెప్పడంతో మనస్తాపానికి గురైన జయంతికుమార్ మంగళవారం నిర్మానుష్య ప్రాంతంలో పురుగుల మందు తాగుతూ తాను ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ ఓ సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో లైవ్ పెట్టాడు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు జయంతికుమార్ ఉన్న ప్రాంతానికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న అతడిని చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

ఈ క్రమంలో చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. మృతుడి తండ్రి తిరుపతి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై మహేందర్ చెప్పారు.

'రాజముద్ర రగడ'పై చర్యలు

- ఒకరి సస్పెన్షన్, ఇద్దరికి షోకాజ్ నోటీసులు
- ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 28: గ్రేటర్ వరంగల్ బల్దియా కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్ లైన్ డెస్క్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో జరిగిన తప్పిదంలో టౌన్ ప్లానింగ్ విభాగం పర్యవేక్షాధికారిపై వేటు పడింది. ఈ ఘటనలో బల్దియా టౌన్ ప్లానింగ్ సూపరింటెండెంట్ కె.జీవన్‌రావును సస్పెండ్ చేస్తూ బుధవారం కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాకుండా టౌన్ ప్లానింగ్ డీసీపీ, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీంద్రరడేకర్‌కు షోకాజు నోటీసులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే..

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం భూములను క్రమబద్ధీకరించేందుకు ఎల్‌ఆర్‌ఎస్ (ల్యాండ్ రెగ్యులేషన్ స్కీమ్) ను అమలులోకి తెచ్చింది. 2020 ఆగస్టు 26లోపు దరఖాస్తు చేసుకున్న వారికి ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా భూములను క్రమబద్ధీకరిస్తున్నారు. ఈ నెల 24న బల్దియా కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ఈ మేరకు టౌన్ ప్లానింగ్ పర్యవేక్షణాధికారి జీవన్‌రావు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అయితే ఇందులో కాకతీయ కళాతోరణం, చార్మినార్ తోగోతో కూడిన రాజముద్రను మరిచి రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయని లోగోలతో కూడిన రెండు ఫ్లెక్సీలను పెట్టారు. దీంతో అక్కడే ఉన్న బీఆర్‌ఎస్ నాయకులు ఆ ఫ్లెక్సీని గమనించి బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కేటీఆర్ చీఫ్ సెక్రటరీకి ఎక్స్ వేదికగా ఫ్లెక్సీని ట్యాగ్ చేసి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. అంతేకాకుండా వరంగల్ బల్దియా కార్యాలయంలో ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ విషయమై విచారణ చేసిన అశ్విని తానాజీ వాకడే.. ఇందుకు బాధ్యులైన టౌన్ ప్లానింగ్ సూపరింటెండెంట్ జీవన్‌రావును సస్పెండ్ చేశారు. అదేవిధంగా ఫ్లెక్సీ ఏర్పాటులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన బల్దియా ఇన్‌చార్జి సిటీ ప్లానర్‌కు షోకాజు నోటీసులు జారీ చేశారు.

రోహిణి ఆస్పత్రిపై ఆరోపణలు నిరాధారం

వరంగల్ మెడికల్, ఆగస్టు 28: సీఎం రిలీఫ్ ఫండ్ నిధులను స్వాహా చేసినట్లు తమపై వచ్చిన ఆరోపణలను రోహిణి ఆస్పత్రి యాజమాన్యం తీవ్రంగా ఖండించింది. హనుమకొండ సుబేదారిలోని రోహిణి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, డైరెక్టర్లు డాక్టర్ క్రాంతిరావు, డాక్టర్ బుచ్చిరెడ్డి, డాక్టర్ బోస్ బుధవారం విలేఖర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ మధ్య తమ ఆస్పత్రిపై వస్తున్న కథనాలను, సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. తమపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 2023 మే మాసంలోనే విచారణ అధికారులు తమ ఆస్పత్రిని సందర్శించారని, బిల్లులను తనిఖీ చేశారని పేర్కొన్నారు. ఆరోపణల్లో చూపబడిన బిల్లులు ఆస్పత్రికి సంబంధించినవి కాదని రికార్డుల ద్వారా స్పష్టం చేశామని తెలిపారు. అదే విధంగా ఆ బిల్లులో పేర్కొన్న రోగులు ఎవరూ ఆస్పత్రి అడ్మిట్ కార్డుల్లో లేరని విచారణ అధికారులకు స్పష్టం చేశామన్నారు. ఆ బిల్లులో చికిత్స చేసినట్లు చెబుతున్న వైద్యులు కూడా తమ ఆస్పత్రిలో ఏనాడు పనిచేయలేదని చెప్పారు. ఉమ్మడి వరంగల్ ప్రజలందరూ ఇలాంటి ఆరోపణలు నమ్మవద్దని వారు కోరారు.



మీడియాతో మాట్లాడుతున్న రోహిణి ఆస్పత్రి యాజమాన్యం

పాడి గేదెలను అపహరించిన దొంగలు

మడికొండ, ఆగస్టు 28: పాడి గేదెలను దొంగలు అపహరించిన ఘటన కాజీపేట మండలం రాజీవ్ గృహకల్ప(కడిపికొండ) వద్ద జరిగింది. మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజీవ్ గృహకల్ప వద్ద కొంతకాలంగా షఫియుద్దీన్ అనే రైతు కాకతీయ గేదెల డైయిరీ ఫామ్ నిర్వహిస్తున్నాడు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు డెయిరీ ఫామ్‌లోని రెండు పాడి గేదెలను ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న రైతు.. బుధవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత రైతు ఫిర్యాదుతో వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ఇన్‌స్పెక్టర్ కిషన్, ఎస్సై రాజబాబు బాధితుడి నుంచి వివరాలు తెలుసుకున్నారు. గేదెల విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని తెలిపారు. త్వరలోనే నిందితులను పట్టుకొని గేదెలను స్వాధీనం చేసుకుంటామని ఇన్‌స్పెక్టర్ కిషన్ స్పష్టం చేశారు.

కేయూ పీహెచ్‌డీ అడ్మిషన్లకు హైకోర్టులో చుక్కెదురు

కేయూ క్యాంపస్, ఆగస్టు 28: కాకతీయ యూనివర్సిటీ కేటగిరీ 1, 2 అడ్మిషన్లను వెంటనే నిలిపివేయాలని రాష్ట్ర హైకోర్టు బుధవారం మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. గతంలో నిర్వహించిన పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షల ఆధారంగా ఇప్పుడున్న సీట్లను భర్తీ చేయడంపై హైకోర్టు అభ్యంతరాలను వ్యక్తం చేసింది. అడ్మిషన్లలో పారదర్శకత, లేదని కాకతీయ యూనివర్సిటీ ఇంజనీరింగ్ విద్యార్థి చల్లా అమరేందర్‌రెడ్డి కోర్టుమెట్లెక్కారు ఆయన అప్పీల్‌తో స్పందించిన హైకోర్టు.. తమ తదుపరి ఉత్తర్వులు వెల్లడించే వరకు ఎలాంటి పీహెచ్‌డీ ప్రవేశాలు చేపట్టరాదని కరాఖండిగా హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. కాగా, 2020-2021 ఏడాదిలో కేయూ అన్ని విభాగాల్లో పీహెచ్‌డీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీ చేసింది. అప్పట్లో జారీ చేసిన నోటిఫికేషన్ ఆధారంగా ఇప్పటివరకు ఖాళీగా ఉన్న పీహెచ్‌డీ సీట్లను భర్తీ చేయాలని కేయూ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇది వివాదాస్పదమైంది, కేటగిరీ, 1, 2 అడ్మిషన్లలో పారదర్శకత లేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ క్రమంలో హైకోర్టు అడ్మిషన్లకు మోకాలడ్డటంతో కేయూలో చర్చనీయాంశమైంది. దీంతో విద్యార్థులు కేయూ దూర విద్య కేంద్రం ఎదుట ఆందోళనలు, దీక్షలు చేపట్టారు. అదే క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థుల వద్దకు వచ్చి ఇచ్చిన హామీ మేరకు వర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లు నిర్వహించాలని వర్సిటీ అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. తాజాగా హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులతో అడ్మిషన్ల ప్రక్రియ సందిగ్ధంలో పడింది.

కేయూ డిగ్రీ పరీక్షల ఫలితాల విడుదల

కేయూ క్యాంపస్, ఆగస్టు 28: కేయూ బీఏ, బీకామ్, ఇతర రెగ్యులర్ కోర్సుల 2, 4 సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు బుధవారం కేయూ రిజిస్టార్ చాంబర్‌లో రిజిస్టార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. రెండో సెమిస్టర్‌లో 28శాతం, నాలుగో సెమిస్టర్‌లో 36 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నర్సింహచారి, అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు. డాక్టర్ ఎం.తిరుమలాదేవి, డాక్టర్ అసీం ఇక్బాల్, సమ్మయ్య, ఏఆర్ ఆర్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కేయూ పరీక్షల ఫలితాలను విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

సంస్కృతికి చిహ్నాలు పురాతన ఆలయాలు

● వేయిస్తంభాల ఆలయంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ● రుద్రేశ్వరుడికి ప్రత్యేక పూజలు



వేయిస్తంభాల ఆలయంలో గవర్నర్‌కు జ్ఞాపికను బహుకరిస్తున్న ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 28: దేశ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాచీన ఆలయాలు చిహ్నాలుగా విరాజిల్లుతున్నాయని, కోట్లాది మంది ప్రజల హృదయాల్లో కొలువైన రుద్రేశ్వరుడిని దర్శించుకోవడం గొప్ప అనుభూతి కలిగించిందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. బుధవారం సాయంత్రం మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, మేయర్ గుండు సుధారాణి తదితర ప్రముఖులతో కలిసి వేయిస్తంభాల ఆలయాన్ని సందర్శించిన గవర్నర్‌కు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో మణికంఠ శర్మ, ప్రణవ్‌శర్మ, ఇతర వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తొలుత ఆలయానికి అభిముఖంగా ఉన్న శిల్పకళాశోభిత నందీశ్వరుడిని, ఉత్తిష్ఠ గణపతిని దర్శించి రుద్రేశ్వరుడి సన్నిధిలో శివ పంచాక్షరి మంత్రంతో బిల్వ దళార్చన చేశారు. అనంతరం ఆలయ కల్యాణ మండపంలో వేద పండితులు గవర్నర్ ఇతర ప్రముఖులకు వేయిస్తంభాల ఆలయ సుందర చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ బృందం ఇటీవల పూర్తయిన కల్యాణ మండపం అందాలను, పురావస్తుశాఖ అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎల్‌ఈడీ స్ర్కీన్ ద్వారా ఆసక్తిగా తిలకించారు.

ఈ సందర్భంగా మీడియాతో గవర్నర్ మాట్లాడుతూ.. వేయిస్తంభాల గుడి లాంటి ఆలయాలను చరిత్ర మరుగున పడకుండా భవిష్యత్‌తరాల వారు తెలుసుకునేందుకు వీలుగా నిత్యనూతనంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆలయంలో శిల్పకళానైపుణ్యం అద్భుతమని, ఎందరో చిత్రకారులు, శిల్పులు అద్భుతంగా చెక్కిన రూపాలు అలనాటి కాకతీయుల ప్రతిభతో పాటు సమాజ శ్రేయస్సు చైతన్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయని కితాబిచ్చారు. సీనియర్ ఐఏఎస్ అధికారి వెంకటేశం, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సిరిసిల్ల రాజయ్య, ప్రొఫెసర్ పాండురంగారావు, హనుమకొండ కలెక్టర్ పి. ప్రావీణ్య, దేవాదాయ శాఖ ఉప కమిషనర్ శ్రీకాంత్‌రావు, పురావస్తు శాఖ అధికారి మల్లేశం, దేవాదాయశాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ రామాల సునిత, ఈవో వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు. ఆలయంలో గవర్నర్ బృందం అరగంట పాటు ఉల్లాసంగా గడిపింది.



వేయిస్తంభాల ఆలయంలో శిల్పకళను పరిశీలిస్తున్న గవర్నర్



కల్యాణమండపం నందీశ్వరుడి వద్ద గవర్నర్..

భద్రకాళికి గవర్నర్ పూజలు

వరంగల్ కల్చరల్, ఆగస్టు 28: వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారిని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ దర్శించుకున్నారు. ఉమ్మడి జిల్లాలోని చరిత్రాత్మక కట్టడాలు, ఆలయాల సందర్శనలో భాగంగా బుధవారం సాయంత్రం భద్రకాళి ఆలయానికి చేరుకున్న గవర్నర్‌కు ఆలయ ఈవో శేషు భారతి, ప్రధానార్చకులు భద్రకాళి శేషు, అర్చక బృందం, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రావు, సహాయ కమిషనర్ రాయల సునీత స్వాగతం పలికారు. వేదమంత్రాలతో, మేళతాళాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. తొలుత గవర్నర్ గణపతి స్వామిని దర్శించుకొని అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. ప్రధానార్చకులు గవర్నర్‌కు అమ్మవారి కుంకుమధారణ చేసి శేషవస్త్రాలు అందజేశారు. మంత్రులు ధనసరి అనసూయ సీతక్క, పొన్నం ప్రభాకర్, నగరమేయర్ గుండు సుధారాణి, 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, మున్సిపల్ కమిషనర్ అశ్విని‌తానాజీ వాకడేలకు అమ్మవారి శేషవస్త్రాలను అందజేశారు. ఈవో శేషుభారతి అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాలను గవర్నర్‌కు అందజేశారు. అమ్మవారి చరిత్రను ప్రధానార్చకులు గవర్నర్‌కు ఆంగ్లంలో వివరించారు. అయితే షెడ్యూల్‌ప్రకారం గవర్నర్ సాయంత్రం 4గంటలకు దేవాలయానికి రావాల్సి ఉండగా 5గంటలకు వచ్చారు. దాదాపు 40 నిమిషాలు ఆలయంలో గడిపారు. గవర్నర్ రాక సందర్భంగా దేవాలయాన్ని పూల మాలలతో అరటి బోదెలతో అలంకరించారు.

అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉంది

భద్రకాళి అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని, దేవాలయ ప్రాంగణం ఆహ్లాదకరంగా కనిపిస్తోందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. భద్రకాళి అమ్మవారి దర్శనం అనంతరం ఖిలా వరంగల్ కోటకు వెళుతూ ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని అనేక చారిత్రక కట్టడాలు, ఆలయాలు, అభివృద్ధిని తిలకిస్తున్నానని, ఆలయాల సందర్శనం, సంస్కృతి, సంప్రదాయాలు, విశిష్టతలను తెలుసుకుంటున్నానన్నారు.



గవర్నర్‌కు భద్రకాళి అమ్మవారి చిత్రపటాన్ని బహుకరిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు



భద్రకాళి ఆలయంలో గోశాల వద్ద గవర్నర్..

కాకతీయుల కట్టడాలను ముందుతరాలకు అందించాలి





కళాతోరణం వద్ద గవర్నర్, మంత్రులు

ఖిలావరంగల్, ఆగస్టు 28: కాకతీయుల అద్భుత కళాఖండాలు, కట్టడాలను ముందుతరాలకు అందించాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాల పర్యటనలో భాగంగా ఆయన బుధవారం సాయంత్రం వరంగల్ మధ్యకోటలోని కాకతీయుల కాలంనాటి కళాఖండాలు, కట్టడాలు, శిల్ప సంపదలను ఆసక్తిగా తిలకించారు. శిల్పాల ఆవరణలోని కాకతీయుల కీర్తితోరణం, రాతి కట్టడాలను తిలకించి పులకించారు. కీర్తితోరణం ముందు ఫొటోలు తీసుకున్నారు. అనంతరం స్వయంభూ - శంభులింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గవర్నర్‌కు కళాకారుడు గడ్డం సుధాకర్ బృందం బోనాలు, బతుకమ్మలు, కోలాటం డప్పుచప్పుళ్ల తదితర కళాకారుల నృత్యాలతో ఖుష్‌మహల్ నుంచి శిల్పాల వరకు స్వాగతం పలికారు. ఆవరణలో పేరిణి శివతాండవాన్ని గజ్జేల రంజిత్ బృందం, చిందు యక్షగానం గజవెల్లి దామోదర్ బృందం, రాణిరుద్రమదేవి నృత్యప్రదర్శన సుధీర్‌రావు బృందం ప్రదర్శించింది. పెండ్యాల లక్ష్మీప్రియ బాలపురస్కార్ అవార్డు గ్రహీను ఘనంగా సన్మానించారు. అనంతరం కళాకారులను శాలువాలతో సన్మానించారు. కోటలో గవర్నర్ పర్యటనలో భాగంగా స్పెషల్ పార్టీ, వరంగల్ సీపీ అంబర్‌కిషోర్ ఝూ ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు భారీ బందోబస్తు

వరంగల్ కోట సందర్శనలో గవర్నర్

నిర్వహించారు. సాయంత్రం 6గంటలకు వచ్చిన గవర్నర్ 7.10 వరకు కోటను సందర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతిరాజ్, శిశుసంక్షేమ శాఖా మంత్రి దనసరి అనసూర్య సీతక్క, బీసీ సంక్షేమశాఖా మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, బల్దియా కమిషనర్ అశ్వినితానాజీ వాకడే, కేంద్ర పురావస్తుశాఖ డిప్యూటీ సూపరింటిండెంట్ డాక్టర్ హెచ్ఆర్ దేశాయ్, జిల్లా అధికారి మల్లేశం, పర్యా టక శాఖ జిల్లా అధికారి శివాజీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ నాయకులు వన్నాల వెంకటరమణ, కుసుమ కుతీష్, సీపీ అంబర్ కిషోర్ ఝూ, కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



ఖిలా వరంగల్ కోటలో పేరిణి నృత్య ప్రదర్శన

గవర్నర్‌కు స్వాగతం పలికిన కొండా

కోటకు వచ్చిన గవర్నర్‌కు మధ్యకోటలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు ఘనస్వాగతం పలికారు. బొకే ఇచ్చి, సత్కరించారు. 37,38 డివిజన్‌ల కార్పొరేటర్లు వెల్పుగొండ సువర్ణ-సురేష్, బైరబోయిన ఉమా-దామోదర్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ కేడల పద్మ-జనార్దన్ స్వాగతం పలికారు.



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న కొండా మురళీధర్‌రావు

సుస్థిరాభివృద్ధిపై దృష్టి పెట్టాలి

(5వ పేజీ తరువాయి)

నిర్వహణ, తడి, పొడి చెత్త నిర్వహణ, బయోమైనింగ్ ప్లాంట్ ఏర్పాటు, కాళోజీ కళాక్షేత్రం నిర్మాణం తదితర అంశాలను వివరించారు. అలాగే వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిస్థితిని సీపీ అంబర్ కిశోర్ ఝూ వివరించారు. అనంతరం జిల్లాలోని వివిధరంగాలకు చెందిన సుప్రసిద్ధ కవులు, కళాకారులు, రచయితలు, జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొందిన క్రీడాకారులు, సామాజిక కార్యకర్తలు, పలు రంగాలకు చెందిన ప్రముఖులతో గవర్నర్ భేటీ అయ్యారు. వివిధ అంశాలపై వారితో ముచ్చటించారు.

వరంగల్ విశిష్ట నగరం

వరంగల్ అనేక ప్రాచీన దేవాలయాలు, వారసత్వ కట్టడాలు ఉన్న సుప్రసిద్ధ, చారిత్ర నగరమని, భవిష్యత్తులో మరింత సుస్థిరాభివృద్ధిని సాధించాలన్న ఆకాంక్షను గవర్నర్ వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో తనకు తన ప్రిన్సిపల్ సెక్రెటరీ బి.వెంకటేశం నగర విశిష్టత, చారిత్రక నేపథ్యం గురించి తెలిపారని, వ్యవసాయరంగంలోనూ జిల్లా ముందుండాలని ఆకాక్షించారు. పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యమిస్తున్నందుకు అధికారులను అభినందించారు. మంగళవారం ములుగు జిల్లా పర్యటనలో భాగంగా తాను ములుగులోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించానని, ఆస్పత్రి ఎంతో పరిశుభ్రంగా ఉండడం తనను ఆకట్టుకుందన్నారు. జిల్లాల్లో అంగన్వాడీ కేంద్రాల ఉన్నతీకరణకు అధికారులు తీసుకుంటున్న చర్యలను గవర్నర్ స్వాగతించారు. కాకతీయులు ఏలిన గడ్డ ఓరుగల్లులో పర్యటించడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అంతా యువ అధికారులే ఉన్నారని, వీరి నేతృత్వంలో అభివృద్ధి మరింత శరవేగంగా జరుగుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఇక్కడి చారిత్రక కట్టడాలను చూసేందుకు ఈ జిల్లాలకు మరోసారి వస్తానన్నారు. ప్రజలు తమ సమస్యలపై తనను స్వేచ్ఛగా కలవవచ్చునని, రాజ్‌భవన్ ద్వారాలు సదా తెరిచి ఉంటాయని గవర్నర్ స్పష్టం చేశారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం

హనుమకొండ, వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ఎన్ఐటీ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న గవర్నర్ జిష్టుదేవ్ వర్మకు ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, మేయర్ గుండు సుధారాణి, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామి రెడ్డి, సీపీ అంబర్ కిశోర్ ఝూ, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్యశారదా, కార్పొరేషన్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, డీఎఫ్‌వోలు అనుజ్ అగర్వాల్, లావణ్య, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి పుష్పగుచ్చాలు అందచేసి ఘనస్వాగతం పలికారు. అనంతరం ప్రజాప్రతినిధులతో గవర్నర్ కొద్ది సేపు సమావేశం అయ్యారు. వరంగల్, హనుమకొండ జిల్లా అభివృద్ధి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చారిత్రకంగా ఈ రెండు జిల్లాల ప్రాశస్త్యం గురించి ఆసక్తిగా ఆరా తీశారు.

సాంస్కృతిక కళా రంగంలో ఓరుగల్లు స్థానం అద్భుతం

ఉమ్మడి జిల్లా జిల్లా ప్రముఖులతో గవర్నర్



రచయిత, కార్టూనిస్టు రమాదేవితో మాట్లాడుతున్న గవర్నర్

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 28: తెలంగాణ ప్రాంతంలోనే సాహిత్య, సాంస్కృతిక కళారంగాల్లో ఓరుగల్లు స్థానం అద్భుతమని, భిన్నరంగాల ప్రముఖలను కలుసుకోవడం ఆనందంగా ఉందని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. హనుమకొండ కలెక్టరేట్‌లో బుధవారం మధ్యాహ్నం ఉమ్మడి జిల్లాకు చెందిన భిన్న రంగాల ప్రముఖులను ఆయన పరిచయం చేసుకున్నారు. ఒక్కొక్కరిని పేరుపేరునా ప్రస్తావిస్తూ కళా, సాహిత్య ఇతర రంగాలలో వారి కృషిని ప్రశంసించారు. ప్రముఖ నవలా రచయిత అంపశయ్య నవీన్, రామా చంద్రమౌళి, డాక్టర్ లంక శివరామప్రసాద్, పొట్లపల్లి శ్రీనివాసరావు, అన్వర్, ప్రముఖ పాత్రికేయుడు, రచయిత గడ్డం కేశవమూర్తి, కార్టూనిస్టు నెల్లుట్ల రమాదేవితో మాట్లాడారు. ప్రముఖ మిమిక్రీ కళాకారుడు లోహిత్ కుమార్, జాతీయ నృత్యకళాకారిణులు వెంపటి శ్రావణి, కాట్రగడ్డ హిమాన్సీ, పేరిణి నృత్యాన్ని జాతీయస్థాయిలో ప్రదర్శిస్తున్న గజ్జెల రంజిత్‌కుమార్, నాటక రంగ ప్రముఖుడు వనం లక్ష్మీకాంతరావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జ్యోతిరావు, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ శేషుమాధవ్, కాళీచరణ్, క్రీడారంగం నుంచి సారంగపాణి, ఎం.డి.అజీజ్‌ఖాన్, మహిళా శక్తి అవార్డు గ్రహీత కొంగ రజిని, సామాజిక రంగం నుంచి మండల పరశురాములు, చేనేత రంగం నుంచి జాతీయ అవార్డు గ్రహీత పిట్టల రాములు, తదితర 40 మంది ప్రముఖులను గవర్నర్ కలుసుకున్నారు. వారితో కలిసి భోజనం చేశారు.

6న హాజరు కావాలని సీపీకి హైకోర్టు నోటీసులు

వరంగల్ క్రైం, ఆగష్టు 28: ఉద్యోగ విరమణ పొందిన కానిస్టేబుల్ పెన్షన్ విషయంలో సీపీ అంబర్ కిషోర్ ఝూకు రెండు రోజుల కిందట హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహించిన యాదాద్రి అనే కానిస్టేబుల్ 2020లో ఉద్యోగ విరమణ పొందారు. ఈ క్రమంలో పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోగా, అతడి భార్య సంతకం కావాలని కమిషనరేట్ అధికారులు సూచించారు.

కుటుంబ కలహాలతో యాదాద్రి భార్య కేసు వేసిందనే కారణంతో పెన్షన్ జారీ విషయంలో కమిషనరేట్ అధికారులు జాప్యం చేశారు. పెన్షన్ జాప్యం కావడంతో కానిస్టేబుల్ కోర్టును ఆశ్రయించారు. దీంతో పెన్షన్ చెల్లించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కమిషనరేట్ కార్యాలయం నుంచి స్పందన లేకపోడంతో కానిస్టేబుల్ మరోసారి కోర్టును ఆశ్రయించారు. సీపీని కానీ, ఆయన తరపున న్యాయవాది హాజరు కావాలని హైకోర్టు నోటీసులు జారీ చేసింది.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీరకం)	2,911	2,700
పల్లికాయ (సూక)	6,300	5,400
పల్లికాయ (పచ్చిది)	4,000	3,000
కందులు	8,552	8,552
పెసళ్లు	6,252	2,552
పత్తి	7,560	5,000
పసుపు (కాడి)	12,459	10,000
పసుపు (గోల)	12,059	11,409
తేజ మిర్చి	12,000	8,000
తేజ ఏసీ	17,500	15,000
వండర్‌హాట్ ఏసీ	16,000	13,000
యూఎస్341 ఏసీ	14,500	11,000
తాలు మిర్చి	6,000	3,000

- వరంగల్ వ్యవసాయం

నేడు డయల్ యువర్ డీఎం

బాలసముద్రం, ఆగస్టు 28: హనుమకొండ డిపోలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు హనుమకొండ డిపో మేనేజర్ భూక్య ధరమ్‌సింగ్ బుధవారం ఒకప్రకటనలో తెలిపారు. హనుమకొండ డిపో పరిధిలోని జమ్మికుంట, వేలేరు, ఐనవోలు, పర్వతగిరి, సంగెం, ఖిలా వరంగల్, హనుమకొండ, హసన్‌పర్తి, కమలాపూర్, వరంగల్, కాజీపేట మండలాల పరిధిలోని గ్రామాల ప్రజలు ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు 9959226049కు ఫోన్ చేయాలని కోరారు.

బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 20ఏళ్ల జైలు

వరంగల్ లీగల్, ఆగస్టు 28: రెండో తరగతి చదువుతున్న బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.20వేల జరిమానా విధిస్తూ వరంగల్ జిల్లా పోక్సో ప్రత్యేక న్యాయస్థానం, 2వ అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి మణిషా శ్రవణ్ ఉన్నమ్ బుధవారం తీర్పుచెప్పారు. బాధితురాలికి రూ.10లక్షలు నష్టపరిహారం చెల్లించాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి.

వరంగల్ రామన్నపేటకు చెందిన బాలికను నమ్మించి వరంగల్ పట్టణ పాపయ్యపేట చమన్ ప్రాంతానికి చెందిన రామరూపుల ప్రభుచరణ్ చెట్ల పొదలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. దీన్ని గమనించిన బాలిక తల్లిదండ్రులు మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు.. నిందితుడిపై పోక్సో చట్టం నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడు ప్రభుచరణ్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.20వేల నగదు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీలు పి.రఘు, శ్రీనివాస్, లైజన్ అధికారి ఎం.వెంకటస్వామి సాక్షులను ప్రవేశపెట్టారు. భరోసా లీగల్ అధికారి సీహెచ్. నీరజ కేసులో సహకరించారు. దర్యాప్తు అధికారులుగా ఎస్‌హెచ్‌వో టి.గోపి, ఏసీపీ డి.చంద్రయ్య వ్యవహరించారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సత్యనారాయణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మర్రి వాసుదేవరెడ్డి కేసు వాదించారు.

తెలుగు వర్సిటీకి పాల్కురికి పేరు పెట్టాలి

తెలంగాణ ఆదికవికి పట్టం కట్టడం చారిత్రక అవసరం

సాహిత్యంలో బహుజనులకు స్థానం కల్పించింది సోమనాథుడే

సీఎం రేవంత్‌రెడ్డికి సాహితీ వేత్తలు, కవుల విజ్ఞప్తి



పాలకుర్తి, ఆగస్టు 28 : తెలంగాణ ఆదికవి, బహుభాషా కోవిధుడు సాహిత్యంలో అనేక ప్రక్రియలకు ఆద్యుడు పాల్కురికి సోమనాథుడు. తెలుగు, సంస్కృతం, కన్నడం, మలయాళం, మరాఠీ, తమిళం లాంటి భాషల్లో ప్రావీణ్యం కలిగిన ఆయన తెలంగాణ ప్రాంతానికి కీర్తి ప్రతిష్టలను తెచ్చి దేశవ్యాప్తంగా పరిచయం అక్కరలేని కవిగా గుర్తింపు పొందాడు. అలాంటి కవికి స్వరాష్ట్ర ప్రభుత్వం పట్టం కట్టాల్సిన చరిత్రక అవసరం ఉందని సాహితీవేత్తలు, కవులు కోరుకుంటున్నారు. దేశ ప్రథమ కవుల్లో ఒకరైన 11వ శతాబ్దానికి చెందిన పాల్కురికి సోమనాథుడిది ప్రస్తుత జనగామ జిల్లా పాలకుర్తి ఆయన స్వగ్రామం. బసవ పురాణం, వృశాధిప శతకం, పండితారాధ్య చరిత్ర లాంటి అనేక ప్రాముఖ్య గ్రంధాలు రాశాడు. పాల్కురికి సోమనాథుడికి ఆయన రాసిన సాహిత్యంపై పాలక వర్గాలు అనేక దశాబ్దాలుగా శీతకన్ను చూపుతున్నాయి. తెలంగాణ ప్రాంతానికి చెందిన కవిగా నిర్లక్ష్యానికి అవహేళనకు, ప్రాంతీయతకు గురయ్యారు. అది నేటికీ కొనసాగుతూ వస్తోంది. ఆయనను కేవలం వీరశైవ సాహిత్యానికి పరిమితం చేసి చరిత్ర కారులు సాహిత్య వేత్తలు తీవ్ర అన్యాయం చేశారు. అనువాద కవులకిచ్చిన ప్రాధాన్యం స్వతంత్ర కవులకు ఇవ్వడం లేదన్న బలమైన విమర్శ ఉంది. సోమనాథుడు సకల ఆధిపత్యాలను తిరస్కరించిన తొలి తెలుగు కవి. అణగారిన తరగతులకు తీవ్ర వివక్షకు గురవుతున్న శ్రామిక జనాలకు సాహిత్యంలో స్థానం కల్పించిన విప్లవ కవి సోమనాథుడు. దేశీయతకు పట్టం కట్టి నూతన ఒరవడులకు జీవం పోశాడు. సంప్రదాయాలను కాలదన్ని సమానత్వం చాటి చెప్పాడు. సమాజ మార్పును ఆకాంక్షించాడు. ఆ రోజుల్లో అది విప్లవకరమైన పరిణామం. అలాంటి సోమనాథుడి సమగ్ర సాహిత్యాన్ని విస్తృతంగా వెలుగులోకి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయితే ఆగస్టు 2న అసెంబ్లీలో సురవరం ప్రతాపరెడ్డి పేరును ప్రస్తావించిన సీఎం రేవంత్‌రెడ్డి అందరూ ఆమోదం తెలిపితే తెలుగు విశ్వవిద్యాలయానికి ప్రతాపరెడ్డి పేరు పెడతామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో కొన్ని వర్గాల నుంచి పాల్కురికి సోమనాథుడి పెరు పెట్టాలని ప్రతిపాదనలు వచ్చాయి. పాలకుర్తికి చెందిన సోమనాథ కళాపీఠం లాంటి సంస్థ స్పందించి పాలమూరు విశ్వవిద్యాలయానికి లేదా మీడియా అకాడమీకి సురవరం ప్రతాపరెడ్డి పేరును సూచించింది. అయితే ఈ కాంక్ష ఇప్పటిది కాదని తెలంగాణ మలిదశ ఉద్యమంలో తెలంగాణ ఆదికవిగా పాల్కూరికి సోమనాథుడిని గుర్తించాలని ఈ ప్రాంతానికి చెందిన మేధావులు, కవులు, రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

సోమనాథుడి పేరు పెట్టాలి

మామిండ్ల రమేష్‌రాజా, కవి, రచయిత పాలకుర్తి,



తెలుగు విశ్వవిద్యాలయానికి పాల్కురికి సోమనాథుడి పెరు పెట్టాలి. స్వరాష్ట్రంలో పాలకులు పెడుతారని తెలంగాణ ఉద్యకారులు, సాహితీ వేత్తలు, ఆశించారు. రాష్ట్రం ఏర్పడి దశాబ్దం కాలం పూర్తయినప్పటికీ పట్టించుకున్న పరిస్థితి లేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా తెలుగు యూనివర్సిటీకి పాల్కురికి సోమనాథుడి పేరు నామకరణం చేస్తే సముచిత గౌరవం ఉంటుంది.

ఇతర వ్యక్తుల పేర్లు పెడితే తప్పిదం జరిగినట్లే

వీరమనేని వెంకటేశ్వర్‌రావు,

సోమనాథ కళాపీఠం బాధ్యుడు, పాలకుర్తి



హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయానికి ఇతర వ్యక్తుల పేర్లు పెట్టినట్లయితే ఉమ్మడి పాలకులు చేసిన తప్పిదాన్ని కొనసాగించినట్లే అవుతుంది. తెలంగాణ ఆది కవి, తొలి తెలుగు స్వతంత్ర కవి, విప్లవ కవి పాల్కురికి సోమనాథుడి పేరు మాత్రమే సమంజసమైంది.

సోమనాథుడి పేరు పెట్టడమే సమంజసం

రాపాక సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, పాలకుర్తి



తెలుగు విశ్వవిద్యాలయానికి బసవపురాణం గ్రంథకర్త పాల్కురికి సోమనాథుడి పేరు పెట్టడమే సరైన నిర్ణయం. రాష్ట్రంలో ఇంకా మిగిలి ఉన్న యూనివర్సిటీలకు సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలి. బడుగు వర్గాల కష్టాలను సాహిత్యంలో స్థానం కల్పించిన సోమనాథుడికే ఆ పట్టం దక్కాలి.



గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్టు

వరంగల్‌సిటీ, ఆగస్టు 28: గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని ఏనుమాముల పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం. ఒడిషా రాష్ట్రం కేసరిగూడకు చెందిన దీపక్ సబర్(25) సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. వచ్చే డబ్బులు చాలక పోవడంతో తన గ్రామంలోనే గంజాయి సరఫరా చేసే వ్యక్తి నుంచి ఆరు కిలోల గంజాయి తీసుకున్నాడు. గంజాయితో ఒడిషాలో ట్రైన్ ఎక్కి పూణేకు బయలుదేరాడు. మార్గమధ్యలో వరంగల్‌లో ట్రైన్‌దిగాడు. ఆ ట్రేన్ మిస్ కావడంతో అతని దగ్గర ఉన్న గంజాయిని తీసుకుని ఏనుమాముల ప్రాంతానికి వచ్చాడు. ఎన్‌టీఆర్‌నగర్ సమీపంలోపోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించగా, అతడి దగ్గరకు వెళ్తుండగా, పారిపోవడానికి యత్నించగా పట్టుకున్నారు. అతడి బ్యాగును తనిఖీ చేయగా మూడు గంజాయి ప్యాకెట్లు దొరకడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఏనుమాముల ఎస్‌ఐ ఎం.రాజు ఫిర్యాదు మేరకు సీఐ రాఘవేందర్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను సన్మానిస్తున్న రెడ్‌క్రాస్ పాలకవర్గం

రెడ్‌క్రాస్ సేవలు భేష్ : గవర్నర్

తలసేమియా వార్డును ప్రారంభించిన గవర్నర్

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 28: రెడ్‌క్రాస్ సేవలు బాగున్నాయని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అభినందించారు. హనుమకొండ సుబేదారిలోని రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయాన్ని ఆయన బుధవారం సందర్శించారు. కలెక్టర్ ప్రావీణ్య, రెడ్‌క్రాస్ పాలకవర్గం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పుష్పగుచ్ఛం అందజేయగా.. జూనియర్ రెడ్‌క్రాస్ విద్యార్థులు బ్యాండ్‌మార్చ్‌తో స్వాగతం పలికారు. ఆవరణలో జెండా ఆవిష్కరించిన గవర్నర్ జనరిక్ మెడికల్ షాప్‌ను సందర్శించి మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రెడ్‌క్రాస్ భవనంపై అంతస్థులో నూతనంగా నిర్మించిన తలసేమియా వార్డును ప్రారభించారు. తలసేమియా బాధితులతో మాట్లాడి వారి బాగోగులు తెలుసుకుని, పండ్లు పంపిణీ చేశారు. కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ చేస్తున్న సేవలు, కార్యక్రమాలను రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి వివరించారు. గవర్నర్ మాట్లాడుతూ.. రక్తదానంతోపాటు సేవా కార్యక్రమాలు చేస్తున్న రెడ్‌క్రాస్ అభ్యున్నతికి అన్ని విధాలా సహకరించాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు సూచించారు. అనంతరం పాలకవర్గం గవర్నర్‌కు షీల్డు అందజేసి ఘనంగా సన్మానించింది. డిల్లీ పబ్లిక్ స్కూల్ జూనియర్ రెడ్‌క్రాస్ విద్యార్థులు హ్యాండ్ పెయింటింగ్ ద్వారా వేసిన గవర్నర్ ఫొటోను ఆయనకు బహూకరించారు. కార్యక్రమంలో 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈవీ శ్రీనివాస్‌రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, డాక్టర్ ఎం.శేషుమాధవ్, పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, కె.సుధాకర్‌రెడ్డి, సీహెచ్.సంధ్యారాణి, బిల్లా రమణారెడ్డి, బాశెట్టి హరిప్రసాద్, డీఎంహెచ్‌వో లలిత పాల్గొన్నారు.

హెలీకాప్టర్‌లో వచ్చిన పొంగులేటి

హనుమకొండ(ఆంధ్రజ్యోతి) : గవర్నర్ పర్యటనలో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గురువారం హెలిక్యాప్టర్‌లో హనుమకొండకు చేరుకున్నారు. సుబేదారిలోని ఆర్ట్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలోని హెలిప్యాడ్‌లో దిగిన పొంగులేటికి మేయర్ సుధారాణి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి స్వాగతం పలికారు. హనుమకొండ కలెక్టరేట్‌లో కార్యక్రమానికి ముందు గవర్నర్‌కు మంత్రి పొంగులేటి సత్కరించారు.

సిబ్బంది లేక ఇబ్బంది..

ఎస్‌ఐ, కానిస్టేబుళ్ల కొరత

సిబ్బందిపై అదనపు భారం

మట్టెవాడ (వరంగల్), ఆగస్టు 28: వరంగల్ పోలీసు సబ్ డివిజన్ పరిధిలో మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్, మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్లలో సిబ్బంది కొరతతో ఉన్న సిబ్బందిపై పని భారం పడుతోంది. కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, మహిళా పోలీసులు, ఏఎస్సైల కొరత ఉంది. మంత్రి క్యాంప్ కార్యాలయం, కాకతీయ మెడికల్ కళాశాల, ఎంజీఎం ఆస్పత్రి, కాళోజీ హెల్త్ యూనివర్సిటీ, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం, ఖిలావరంగల్ కోటా, భద్రకాళీ దేవాలయం, ప్రజాప్రతినిధుల నివాసాలు, బంగారు ఆభరణాల షాపులు, విద్యాసంస్థలు, బస్‌స్టేషన్, రద్దీ ప్రాంతాలు, దీనికి తోడు ధర్నాలు, నిరసన కార్యక్రమాలు, సామాజిక ఉత్సవాలు, వరంగల్ సబ్ డివిజన్ పరిధిలో బందోబస్తుతో సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటాచ్‌మెంట్ డ్యూటీల పేరిట ఉన్న సిబ్బంది ఇతర ప్రాంతాల్లో పని చేస్తున్నారు. వరంగల్ పోలీస్ సబ్ డివిజన్‌లో సిబ్బంది కొరత ఉంది. సీఐ నుంచి కానిస్టేబుళ్ల వరకు 253 మంది పోలీసు సిబ్బంది వరంగల్ సబ్ డివిజన్‌లో ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 141 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మిల్స్‌కాలనీలో 25 సిబ్బంది కొరత, ఇంతేజార్‌గంజ్‌లో 48 మంది, మట్టెవాడలో 42మంది సిబ్బంది కొరత ఉంది.

సిబ్బంది కొరత..

వరంగల్ పోలీసు సబ్ డివిజన్‌పరిధిలో మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్, మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్లు ఉన్నాయి. ఆయా పోలీసు స్టేషన్లలో కొందరు ఎస్సైలు బయట బందోబస్తు ఇతర విధుల్లో ఉండటంతో స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇంతేజార్‌గంజ్, మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్లలో నలుగురు ఎస్సైల చొప్పున ఉండాల్సి ఉండగా, ఇద్దరు ఉన్నారు. మట్టెవాడ నలుగురి బదులు ముగ్గురు విధులు నిర్వహిస్తున్నారు. అలాగే పోలీసు కానిస్టేబుళ్లు, ఏఎస్సై, హెడ్ కానిస్టేబుళ్ల కొరత తీవ్రంగా ఉంది. ఉన్న పోలీసు సిబ్బందిపై పనిభారం పడుతోంది. వరంగల్‌లో బందోబస్తులు, మంత్రుల పర్యటనలు, వివిధ సామాజిక కార్యక్రమాలు, సభలు, సమావేశాల భద్రత, పండుగలు, ఉత్సవాలు, ప్రముఖుల పర్యటనలతో పోలీసు స్టేషన్లలోని సిబ్బంది బందోబస్తు విధుల్లో ఎక్కువ సమయం గడపాల్సి వస్తోందని సిబ్బంది వాపోతున్నారు. స్టేషన్‌లో ఫిర్యాదులపై విచారణ, కేసుల విచారణ, కొంత మంది కోర్టు విధులు నిర్వహిస్తుండంతో ఫిర్యాదుల పరిష్కారానికి సమయం సరిపోవడం లేదు.

మట్టెవాడ పోలీసు స్టేషన్‌లో...

మట్టెవాడ పోలీసు స్టేషన్‌లో నలుగురు ఎస్సైలు ఉండాల్సిందిగా ముగ్గురే ఉన్నారు. ఏఎస్సైలు ఆరుగురికి, ఆరుగురు ఉన్నారు. హెడ్ కానిస్టేబుళ్లు 14 మందికి 14 మంది ఉన్నారు. కానిస్టేబుళ్లు 60మందికి 22మందే ఉన్నారు. మహిళా కానిస్టేబుళ్లు ఆరుగురు ఉండాల్సిందిగా ముగ్గురు మాత్రమే ఉన్నారు. 91మంది సిబ్బందికి 49మంది మాత్రమే ఉన్నారు.

మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్‌లో...

మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్‌లో ఐదుగురు ఎస్సైలకు ముగ్గురే ఉన్నారు. ఏఎస్సైలు 8 మంది ఉండాల్సిందిగా ఆరుగురు ఉన్నారు. హెడ్ కానిస్టేబుళ్లు 10 మందికి 9మంది, కానిస్టేబుళ్లు 54 మందికి 39, మహిళా పోలీసులు 8 మందికి ముగ్గురే ఉన్నారు. మొత్తంగా 86 మంది ఉండాల్సిన ఉండగా 61 మందే పని చేస్తున్నారు.



- ఇంతేజార్‌గంజ్ పోలీసు స్టేషన్‌లో..

ఇంతేజార్‌గంజ్ పోలీసు స్టేషన్‌లో నలుగురు ఎస్సైలు ఉండాల్సిందిగా ఇద్దరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఏఎస్సైలు నలుగురికి ముగ్గురు, హెడ్ కానిస్టేబుళ్లు 10మందికి ఏడుగురు, కానిస్టేబుళ్లు 53 మందికి 13మంది విధులు నిర్వహిస్తున్నారు. మహిళా కానిస్టేబుళ్లు నలుగురు ఉండాల్సిందిగా ఇద్దరే ఉన్నారు. 76 మంది పని చేయాల్సిన ఉండగా 31 మాత్రమే ఉన్నారు.



ఆంజనేయుడి భారీ విగ్రహ ప్రతిష్ఠ

ఖిలావరంగల్, ఆగస్టు 28: అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం కన్నులపండువగా జరిగింది. సిద్ధ మహాయోగి (తెలంగాణ, ఉత్తరాఖండ్) పీఠాధిపతి చైతన్యానందస్వామి ఖమ్మంరోడ్ వద్ద శ్రీ శివశక్తి వినాయక మందిరంలో గణపతి, శివలింగ నందీశ్వర సహిత పార్వతీ దేవి విగ్రహ ప్రతిష్ఠాపనను అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వై జంక్షన్‌లో ఏర్పాటు చేసిన 18 అడుగుల భారీ అభయాంజనేయస్వామి విగ్రహానికి ఆయన ప్రారంభోత్సవం చేశారు. బుధవారం ఉదయం మహాగణాధిపూజ, యంత్రార్చనలు ఆలయ ప్రవేశం, పర్యగ్నికరణ సహిత వాస్తుపూజలు, పీఠపూజలు, నవరత్న న్యాసం, గణపతి, శివలింగ, నందీశ్వరస్వామివారి అనుగ్రహంతో ఉదయం 8.11 గంటలకు యంత్ర విగ్రహస్థాపనలు నిర్వహించారు. అనంతరం పరిసర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు మొక్కులు చెల్లించారు. అనంతరం మహా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మందిరం అధ్యక్షుడు, కార్పొరేటర్ బైరబోయిన ఉమాదామోదర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి చెన్నూరి దేవేందర్, కోశాధికారులు మంతిని చక్రధర్, గండి నాగరాజు, గంద్రాతి నవీన్, ఉపాధ్యక్షులు సిద్ధం రాము, అచ్చ వినోద్, గొడిశాల సూరజ్, బాసాని శ్రీనివాస్, నల్లకుంట రవిందర్, వడ్డెపల్లి భరత్, తాళ్ళపల్లి రమేష్, పొన్నం కుమారస్వామి, అపరాదపు సారంగపాణి, గజ్జెల శ్యామ్, వాసం సదానందం, కొత్తపెల్లి శ్రీనివాస్, నాగవెళ్ళి రాజన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ప్రారంభిస్తున్న చైతన్యానందస్వామి

ప్రముఖుల పూజలు

విగ్రహాల ప్రతిష్ఠాపనతోపాటు 18అడుగుల భారీ అభయా ంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన నేపథ్యంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, వన్నాల శ్రీరాములు, కుసుమ సతీష్ పూజలు చేశారు.

బీజేపీ నాయకుల సమీక్షా సమావేశం

కరీమాబాద్, ఆగస్టు 28: వికసిత్ భారత్ 2047 లక్ష్యానికి అనుగుణంగా జాతీయ స్థాయి నుంచి ప్రతి రాష్ట్రం, నగరం, గ్రామం, బూత్‌స్థాయి వరకు పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతీ కార్యకర్త సహకరించాలని జిల్లా అధ్యక్షుడు పోలేపాక మార్టిన్ లూథర్, ప్రధాన కార్యదర్శి మాదాసు రాజు కోరారు. బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు, మాజీ శాసన సభ్యుడు కొండేటి శ్రీధర్ సూచన మేరకు బుధవారం 33వ డివిజన్‌లో బీజేపీ నాయకులు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమానికి మండల, డివిజన్, బూతుస్థాయి నుంచి కన్వీనర్ల నియామకం చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా, మండల, గ్రామ, బూతు స్థాయి వరకు కార్యశాలలు ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతానని తెలిపారు. ఈనెల 30న పార్టీ కార్యాలయంలో అవగాహన కార్యక్రమానికి ప్రతీఒక్కరు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీమోర్చా ప్రధాన కార్యదర్శులు మాదాసు రాజు, ఉసిల్ల దయాకర్, నమిండ్ల కన్నయ్య, ఉపాధ్యక్షుడు నలిగంటి నర్సింగం, వీరస్వామి, ప్రవీణ్, కోటి, రాజు, విజయ్, రాకేష్, వాసు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లూథర్, రాజు

సమస్యలకు పరిష్కార మార్గం చూపింది కమ్యూనిస్టు పార్టీ

వరంగల్ చౌరస్తా, ఆగస్టు 28: దేశంలోని అనేక సమస్యలకుపరిష్కార మార్గాలు చూపించింది భారత కమ్యూనిస్టు పార్టీ(మార్కిస్టు)అని సీపీఎం రాష్ట్ర నాయకులు పి.సోమయ్య అన్నారు. సీపీఎం జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు రామన్నపేట రఘునాథ్‌కాలనీ సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. పార్టీకి సంబంధించిన అంశాలపై ఆయన బోధించారు. దేశంలోని నిర్దిష్ట పరిస్థితులకు అంచనా వేసి వాటికి శాశ్వతమైన పరిష్కార మార్గాలు చూపెట్టిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సింగారపు బాబు, జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య, నలిగంటి రత్నమాల, ముక్కెర రామస్వామి, అరూరి కుమార్, సాగర్, బషీర్, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేయాలి

గీసుగొండ, ఆగస్టు 28: పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేసేలా అకాడమిక్ ప్లానింగ్‌ను తయారు చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి డాక్టర్ శ్రీధర్‌సుమన్ అన్నారు. కొనాయిమాకులలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్‌డేను బుధవారం నిర్వహించారు. ముఖ్యతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకుముందు అధ్యాపకుల, విద్యార్థుల రికార్డులను పరిశీలించారు. సకాలంలో సిలబస్‌ను పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అశోక్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్‌సుమన్

ఇంటి ప్రహరీని ఢీ కొట్టిన లారీ

శంభునిపేట, ఆగస్టు 28 : లారీ అదుపుతప్పి ఓ ఇంటి ప్రహరీని ఢీకొట్టిన ఘటన బుధవారం రంగశాయిపేటలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గుంటూరు నుంచి జగిత్యాలకు వంటనూనె లోడుతో వెళ్లే లారీ రంగశాయిపేట వాటర్‌ట్యాంకు వద్ద ఉదయం అదుపు తప్పింది. దాంతో వెంకట్రాజం అనే వ్యక్తి ఇంటి ప్రహరీని ఢీకొట్టడంతో అది ధ్వంసమైంది. ఆ ఇల్లును ఓ ప్లంబింగ్ షాపునకు అద్దెకు ఇచ్చారు. ఢీకొట్టిన సమయంలో ఎవరూ లేకపోవటంతో పెద్ద ప్రమాదం తప్పింది. డ్రైవర్ నిద్ర మత్తులో ఉండటంతోనే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. మిల్స్‌కాలనీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.



ఎమ్మెల్సీ కవితను కలిసిన నరేందర్

మట్టెవాడ, ఆగస్టు 28 : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ మంజూరైన సందర్భంగా బుధవారం వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ కలిశారు. న్యూఢిల్లీలో కవితకు పుష్పగుచ్ఛం అందించి జై తెలంగాణ అని నినదించారు. అనంతరం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

సమాజ సేవ చేయాలి

శంభునిపేట, ఆగస్టు 28 : సమాజ సేవను అదృష్టంగా భావించాలని వరంగల్ తూర్పు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాధిక అన్నారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ మాణిక్యరేఖ ఆధ్వర్యంలో కళాశాలలో విద్యార్థినులకు బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ అవగాహన సదస్సు నిర్వహించారు. రెండు రోజుల సదస్సులో కళాశాల వైస్ ప్రిన్సి పాల్ డాక్టర్ మమత, అధ్యాపకులు, పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

గిర్మాజిపేట, ఆగస్టు 28 : ఇంటర్ మీడియట్ విద్య జీవితంలో అత్యంత కీలకమని, మానసిక ఆరోగ్యంపై విద్యార్థులు అవగాహన కలిగిఉండాలని కృష్ణకాలనీ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శరద్రుతి అన్నారు. బుధవారం కళాశాలలో విద్యార్థుల మానసిక ఆరోగ్యం-టెలిమానస్ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అందరు కలిసి మాట్లాడుకోవడంతో సమన్వయ బంధం ఏర్పడుతుందన్నారు. పరిస్థితులకు అనుగుణంగా తగిన ప్రణాళికను రూపొందించుకుని మూర్తిమత్వం పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ డాక్టర్ భరత్ కుమార్, కళాశాల జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులు వనమాల, ప్రవళిక అధ్యాపకులు హరికృష్ణ,శ్రీనివాస శర్మ, కరుణ, శ్రీమంజుల, షబానా,హేమలత, విజయలక్ష్మీ, కల్పన, శ్వేత, మనోహర్ పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

గిర్మాజీపేట, ఆగస్టు 28 : శ్రావణమాసం పోచమ్మ బోనాల సందర్భంగా బుధవారం నగరంలో పోచమ్మ దేవాలయాలు బోనాలతో సందడిగా మారాయి. రైల్వేస్టేషన్ సమీపంలోని పోచమ్మ దేవాలయంలో ఉదయం నుంచి భక్తులు బారులు తీరారు. మహిళలు డప్పుచప్పుళతో బోనాన్ని సమర్పించారు. గోవిందరాజుల గుట్ట ప్రాంతానికి చెందిన ముదిరాజ్ వర్గీయులు సంప్రదాయంగా ఊరేగింపుతో బోనాలు సమ ర్పించారు. స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో గోవిందరాజుల గుట్ట ముదిరాజ్ వాడ నుంచి మొదలైన బోనాల ఊరేగింపు ముందుభాగాన చింతాకుల సునీల్ సంప్రదాయ కత్తి విన్యాసం ఆకట్టుకుంది.



మొక్కులు సమర్పించుకున్న కార్పొరేటర్ దంపతులు

మోదీ చిత్రపటం దహనం



మట్టెవాడ, ఆగస్టు 28: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్‌పై విడుదలైన సందర్భంగా బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు సయ్యద్ మసూద్ ఆధ్వర్యంలో మండిబజార్‌లో స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం మసూద్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటాన్ని దహనం చేశారు. మసూద్ మాట్లాడుతూ.. లిక్కర్ స్కామ్ మోదీ కథ అని, దీనికి స్క్రీన్‌ప్లే, దర్శకత్వం మోదీ అని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నెల్సన్, అంకుష్, ఆఫ్రోజ్, ఇంతియాజ్, రాజ్‌కుమార్, లక్ష్మీ, పుష్ప పాల్గొన్నారు.



వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ

గురుకుల పాఠశాలలో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

నెక్కొండ, ఆగస్టు 28 : నెక్కొండ మండలం పెద్దకొర్పోలు గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాల అవరణలో ఉన్న సింగిల్ ఫేజ్ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ పచ్చని చెట్లు అల్లుకొని ఉన్నాయి. గురుకుల పాఠశాలకు విద్యుత్ సరఫరా చేస్తున్న ఈ ట్రాన్స్‌ఫార్మర్ చెట్ల అల్లికల తీగల ద్వారా వర్షం వచ్చిన సమయంలో విద్యుత్ సరఫరా జరిగితే షాక్ వస్తుందంటూ విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను అల్లుకున్న చెట్లను తొలగించాలని కోరుతున్నారు.



చెట్లపొదలు అల్లుకుని ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్

మంత్రి దామోదరను కలిసిన టాస్ నాయకులు



మంత్రిని కలిసిన టీఏ సంఘం ప్రతినిధులు

వర్ధన్నపేట, ఆగస్టు 28 : రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను తెలంగాణ అంబేడ్కర్ (టీఏ) సంఘం రాష్ట్ర కమిటీ ప్రతినిధులు బుధవారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్ర మంలో టాస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య, అధికార ప్రతినిధి తూముల సదానందం, ఉపాధ్యక్షుడు వెలమకంటి దయాకర్, మేకల చేరాలు తదితరులు పాల్గొన్నారు.

టీచర్లు సృజనాత్మకంగా బోధించాలి



నల్లబెల్లిలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఫ్లోరెన్స్

నల్లబెల్లి, ఆగస్టు 28 : టీచర్లు సృజనాత్మకంగా విద్యార్థులకు బోధించినప్పుడే నాణ్యతతో కూడిన ఉన్నత ఫలితాలు వస్తాయని జీఈసీవో ఫ్లోరెన్స్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో జీఈసీవో, ఎంఈవోలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫ్లోరెన్స్ మాట్లాడుతూ కస్తూర్బాలోని వంట రూంలో ఆహార పదార్థాలను తనిఖీ చేసి విద్యార్థులకు పౌష్టికాహారన్ని అందించాలని కోరారు. లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఉపాధ్యాయుల రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు సమర్థవంతంగా విద్యార్థులకు బోధించాలని కోరారు. లేదంటే శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈవో చదువుల సత్యనారాయణ, ఎస్‌వో సునీత, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

● దుగ్గొండి : విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదివితే పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు వస్తాయని జిల్లా బాలికల అభివృద్ధి అధికారి (జీసీడీవో) ఫ్లోరెన్స్ అన్నారు. మండలంలోని మల్లంపల్లి కస్తూర్బా విద్యాలయాన్ని బుధవారం ఎంఈవో చదువుల సత్యనారాయణతో కలసి జీసీడీవో ఫ్లోరెన్స్ సందర్శించి తనిఖీ చేశారు. విద్యాలయ ఆవరణలోని పరిసరాలను, హాజరు రిజిస్టర్, స్టోర్ రూమ్, వంట గదిని పరిశీలన చేశారు. పదో తరగతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పట్టుదలతో ఇష్టంగా చదివితే 100 శాతం ఉత్తీర్ణత పొందుతారన్నారు. విద్యార్థులకు రాయడం, చదవడం వచ్చే విధంగా ఉపాధ్యాయులు బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యాలయ ప్రత్యేక అధికారి మంజుల, ఉపాధ్యాయులు రమ, సుభాషిణి, అనుషా, పుష్పలీల, స్రవంతి, సరస్వతి, లావణ్య, రాధిక కవిత తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల దారేదీ ?

ఆహార భద్రత కార్డులో పిల్లల వివరాల నమోదుకు నిరీక్షణ

వర్ధన్నపేట, ఆగస్టు 28 : ఆహార భద్రత కార్డుల్లో పిల్లల వివరాలను చేర్పించే అవకాశం లేకుండా పోయింది. కనీసం దరఖాస్తు చేసుకోవడానికి కూడా వీలులేదు. దీంతో వేలాది మంది బాధితులు వారి పిల్లల వివరాలు రికార్డుల్లో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ పిల్లల పేర్లను ఆహార భద్రతా కార్డుల్లో నమోదు చేయాలంటూ 50వేల మందికిపైగా మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులు ఆరేళ్లుగా పెండింగ్‌లోనే ఉంటున్నాయి. గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

మొదటి బిడ్డది పెండింగ్..

పదేళ్ల క్రితం నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం ఆహారభద్రతా కార్డులు జారీ చేసింది. తరువాత రెండు సార్లు కొత్తకార్డులు జారీ చేసింది. కానీ కుటుంబ సభ్యుల వివరాలను కార్డుల్లో చేర్పించడానికి అవకాశం కల్పించలేదు. మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించింది. దీంతో ఆయా కుటుంబాలు తమ పిల్లల వివరాలను కార్డుల్లో చేర్పించాలని దరఖాస్తులు సమర్పించారు. కానీ, వారి వివరాలు ఇప్పటికీ నమోదు కాలేదు. అంతలోనే వారికి రెండవ సంతానం కలిగింది. దీంతో వారు రెండవ బిడ్డ వివరాలను కూడా రేషన్‌కార్డుల్లో నమోదు చేయించాలని దరఖాస్తు చేయడానికి మీసేవా కేంద్రాలకు వెళుతున్నారు. కానీ, మొదటి బిడ్డ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నందున రెండవ బిడ్డ దరఖాస్తు తీసుకోవడం లేదు. దీంతో వేలాది మంది నిరాశ చెందుతున్నారు. రెండవ బిడ్డ దరఖాస్తులు తీసుకుంటే దరఖాస్తుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉండడం వల్ల రెండవ బిడ్డ నమోదు దరఖాస్తు తీసుకోవడం లేదని పౌర సరఫరాల శాఖ అధికారులు పేర్కొంటున్నారు.



'జిల్లాస్థాయి గ్రామీణ క్రీడలు నిర్వహించాలి'



తీర్మానాన్ని ప్రకటిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

గీసుగొండ, ఆగస్టు 28 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) జిల్లాస్థాయి క్రీడలను గీసుగొండలో నిర్వహించాలని పీడీ, పీఈటీ సంఘం ఏకగ్రీవంగా తీర్మానించింది. బుధవారం గీసుగొండ జెడ్పీ పాఠశాలలో పీడీ, పీఈటీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ కారదర్శిగా గీసుగొండ పీడీ శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. అనంతరం స్కూల్ హెచ్‌ఎం పట్టాభి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లోని క్రీడా ప్రతిభను వెలికి తీయాల్సిన బాధ్యత వ్యాయామ ఉపాధ్యాయులపై ఉందన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

పర్వతగిరి, ఆగస్టు 28 : మండలంలోని కల్లెడ పీఏసీఎస్ హాల్‌లో గురువారం కళ్యాణలక్ష్మి, షాది ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ వెంకటస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు చెక్కులను అందజేస్తారని తెలిపారు.

లింగగిరి మాజీ సర్పంచ్ మృతి



పెద్దయ్య (ఫైల్)

చెన్నారావుపేట, ఆగస్టు 28 : మండలంలోని లింగగిరి గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చీకటి పెద్దయ్య (72) అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. 2001- 2005 లో గ్రామ సర్పంచ్‌గా ప్రజలకు సేవలను అందించారు. మృతునికి ముగ్గురు కుమారులు చీకటి రాజు, రాము, రఘులున్నారు. కాగా, కాంగ్రెస్ నాయకులు పెద్దయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దెన రమేష్, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్యగౌడ్, మాజీ సర్పంచ్ మాదారాపు భాస్కర్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీష్, చింతం కుమార్, మాదారాపు చరణ్, రాజు, సోమయ్యగౌడ్, తాడెం ప్రభాకర్, యాకాంతం, రాజు కార్తీక్ ఉన్నారు.

కారు ఢీకొని రైతు మృతి



బిల్యా (ఫైల్)

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 28: పొలంలో మందు చల్లడానికి వెళ్తున్న రైతును వేగంగా వస్తున్న కారు ఢీకొన్న ఘటనలో రైతు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని కుమ్మరిగూడెంకు చెందిన రైతు భూక్యా బిల్యా(50) ఇల్లంద గ్రామానికి చెందిన సట్ల సమ్మయ్యకు చెందిన వ్యవసాయ భూమిని కౌలుకుచేస్తున్నాడు. అందులో సాగుచేసిన వరి పంటకు ఎరువులు చల్లడానికి ట్రాక్టర్‌లో ఎరువుల బస్తాలు వేసుకుని కుమారుడు భూక్యా మురళి, అతని స్నేహితులు వెళ్తుండగా, ట్రాక్టర్‌కు కొద్దిదూరంలో తన ద్విచక్ర వాహనంపై బిల్యా వస్తుండగా వరంగల్ నుంచి ఖమ్మం వైపువెళ్తున్న కారు వేగంగా వచ్చి అదుపు తప్పి ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలై తీవ్రరక్త స్రావం జరుగుతుండగా ట్రాక్టర్‌లో వెళుతున్న కుమారుడు గమనించి వచ్చేసరికి బిల్యా మృతిచెందాడు. మృతుడి కుమారుడు మురళి ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసుకుని శవ పంచనామా చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వర్ధన్నపేట సివిల్ ఆస్పత్రికి తరలించారు.

ఆర్టీసీ బస్సు రాకతో ఆనందం

సంగెం, ఆగస్టు 28 : ఆర్టీసీ బస్సు రాకతో ఎల్గూరురంగంపేట వాసులు ఆనందం వ్యక్తం చేస్తూ, బస్సుకు బుధవారం స్వాగతం పలికారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీ అధికారులు వరంగల్ నుంచి ఎల్గూరురంగంపేట ఆర్టీసీ బస్సును నడుపుతున్నారు. కాంగ్రెస్ నాయకుడు జనగాం రమేష్, మాజీ సర్పంచ్ పోతుల ప్రభాకర్‌తోపాటు పలువురు గ్రామస్థులు బస్సుకు స్వాగతం పలికారు.

ఘనంగా మైసమ్మ బోనాలు

గీసుగొండ, ఆగస్టు 28: మొగిలిచర్ల కోట మైసమ్మతల్లి బోనాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, శివసత్తులు బోనాలను ఎత్తుకొని డప్పువాయిద్యాలతో ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యాలు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అమ్మవారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి పట్టాలు వేసి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు బొట్టు రాజు, ప్రధాన అర్చకుడు రాజేంద్రప్రసాద్ చారి, శివసత్తుల వెంకన్న బృందం రమేష్, నాగరాజు, జిట్టి రాజు, వీరయ్య, ఉపేందర్, కుమారస్వామి, కిరణ్ పాల్గొన్నారు.

కవిత విడుదలపై హర్షం

రాయపర్తి, ఆగస్టు 28: ఎమ్మెల్సీ కవిత బెయిల్‌పై విడుదల కావడంతో బుధవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తంచేశారు.బాణాసంచా కాల్చి ఒకరికొకరు స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీకి ఉద్యమాలు, జైలు కొత్తేమీకాదని, ఎవరెన్ని కుట్రలు పన్నినా బీఆర్ఎస్ పార్టీ ఔన్నత్యాన్ని దెబ్బతీయలేరని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, మాజీ రైతు బంధు అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు,మాజీసర్పంచ్ గారె నర్సయ్య, మాజీఎంపీటీసీ ఐత రాంచందర్, చెవ్వు కాశీనాథం, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, ఉప్పలయ్య, వేణు పాల్గొన్నారు.

● చెన్నారావుపేట : బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు కావడంపై మండలంలోని చెరువుకొమ్ముతండాలో బీఆర్ఎస్ మండల నాయకుడు బోడ బుద్ధనాయక్ ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం బాణసంచా కాల్చారు. స్వీట్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో బోడ మురళినాయక్, భూక్య శ్రీను, లచ్చిరాం, బాలు, నర్సు, అజ్మీరా మోహన్, వాంకుడోదు వీరాస్వామి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమించాలి

నర్సంపేట, ఆగస్టు 28 : విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారంకోసం ఉద్యమించాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్రకమిటీ సభ్యురాలు వంగల రాగసుధ పిలుపు నిచ్చారు. బషీర్‌బాగ్ విద్యుత్ పోరాట అమరవీరులు విష్ణువర్ధన్, బాలస్వామి, రామకృష్ణల 24వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద బుధవారం విద్యుత్ అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని నాటి తెలుగుదేశం ప్రభుత్వాన్ని డిమాండ్‌చేస్తూ ఉద్యమించిన వారిపై జరిపిన బాష్పవాయువు, కాల్పుల్లో ముగ్గురు ప్రాణాలను కోల్పోయారన్నారు. విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని పోరాటాలుచేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కె.యాకయ్య, గడ్డం స్వరూప, సతీష్, అచల. అనూష, నిర్మల, పుష్ప, నీలా, దేవమ్మ, జబీన్, రాజు, బండారి లావణ్య, లక్ష్మి, ప్రమీల పాల్గొన్నారు. అలాగే సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద విద్యుత్ అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి అడ్డూరి రాజు, జవహర్‌లాల్, మనోహరచారి, స్వామి, రాజేందర్, వెంకన్న, వీరన్న తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ అమరవీరుల చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పిస్తున్న ఎంసీపీఐ(యూ)నాయకులు, మహిళలు

● నల్లబెల్లి : విద్యుత్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని విద్యుత్ అమరవీరుల 24వ వర్ధంతి సభను ఎంసీపీఐయూ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గోనె కుమారస్వామి, నాగెల్లి కొమురయ్య, కుసుంబరావు, రాజాసాహెబ్, రాజమౌళి, దామ సాంబయ్య మార్త నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● సంగెం : విద్యుత్ ఉద్యమ అమరవీరుల త్యాగాలను మరువద్దని ఎంసీపీఐ సంగెం మండలశాఖ అధ్యక్షుడు ఎండీ.ఇస్మాయిల్ అన్నారు. కుంటపల్లిలో మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కరెంటు ఉద్యమంలో అమరులైన అమరవీరులకు నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కన్వీనర్ గోనే రామచందర్, నాయకులు రౌతు శ్రీనివాస్,జక్కా అశోక్, రాగది రవి,, సాంబయ్య, శివకుమార్, అయిలయ్య పాల్గొన్నారు.

'బిట్స్'లో ప్రాంగణ నియామకాలు

నర్సంపేట టౌన్, ఆగస్టు 28 : నర్సంపేట మండలం లక్నేపల్లి శివారులోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో ట్రాక్ 3డి.ఏఐ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రాంగణ నియామకాలు చేపట్టారు. బిట్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎ. రాజేంద్రప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ట్రాక్ 3డి.ఏఐ ఇంజనీరింగ్‌లో విశేష అనుభవం కలిగిన సంస్థలని అన్నారు. ప్రాంగణ నియామకాల్లో 522 మంది విద్యార్థులు పాల్గొనగా, 32 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ డాక్టర్ జి.రాజేశ్వర్‌రెడ్డి. ప్రిన్సిపాల్ హరిహరన్, ఏవో ఎస్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న గుడుంబా, నల్లబెల్లం స్వాధీనం

చెన్నారావుపేట, ఆగస్టు 28: మండలంలోని ఉప్పరపల్లి గ్రామం మీదుగా అక్రమంగా తరలిస్తున్న గుడుంబా, నల్లబెల్లంను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజు సీఐ నరేష్‌రెడ్డి బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి మండలంలోని అడ్డబాటతండాకు చెందిన బోడ రాజు. ఉప్పరపల్లి గ్రామానికి చెందిన భూక్య భద్రు అనే వ్యక్తులు అక్రమంగా ద్విచక్ర వాహనాలపై 120కిలోల నల్లబెల్లం. 20కేజీల పటిక, ఏడు లీటర్ల గుడుంబాను తరలిస్తున్నారు. సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారులు గుడుంబాతో పాటు నల్లబెల్లం, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఇద్దరిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కార్యక్రమంలో ఎస్సై రాజన్న, శార్వాణి, కానిస్టేబుల్ రాంమూర్తి, నాగరాజు, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 28 : మండలంలోని కట్ర్యాల గ్రామ శివారులో బుధవారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ఇద్దరు వ్యక్తుల కాళ్లు, చేతులు, తల భాగంలో గాయలై తీవ్రంగా గాయపడడంతో స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఘటనలో ద్విచక్ర వాహనాలు పూర్తిగా దెబ్బతిన్నాయి.

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 28 : ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సురేష్ అన్నారు.బుధవారం మండలంలోని ఇల్లందలో కాకతీయ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం గొడిశాల శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఆబర్ల సాయిలు, సమ్మెట సదా శివుడు, ఏఎన్ఎం సరోజ, ఆశ కార్యకర్త, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎలుకుర్తిలో ఉచిత వైద్య శిబిరం

గీసుగొండ, ఆగస్టు 28 : ఎలుకుర్తిలో ఆయూష్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయుర్వేద వైద్యుడు షైదం రాజు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సహజ, కార్యదర్శి నరేష్, పర్వీన్,రాజు, సతీష్ పాల్గొన్నారు.

బీజేపీలో యువతకు ప్రాధాన్యం



నర్సంపేటలో మాట్లాడుతున్న రాణా ప్రతాప్‌రెడ్డి

నర్సంపేట, ఆగస్టు 28 : బీజేపీలో యువతకు అధిష్టానం ప్రాధాన్యత ఇస్తుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణాప్రతాప్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ సభ్యత్వ నమోదు ప్రముఖ్ వడ్డెపల్లి నర్సింహరాములు అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వికసిత భారత్ బీజేపీతోనే సాధ్యమవుతుందన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా పాలన సాగిస్తూ అభివృద్ధికి కొత్త నిర్వచనం ఇచ్చే బీజేపీ రాజకీయాల్లో యువతకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. దేశాన్ని అన్నిరంగాలలో అగ్రగామిగా నిలిపేందుకు ప్రధాని నరేంద్రమోదీ కృషిచేస్తున్నారని ఆయన అన్నారు. సమావేశం అనంతరం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రేసు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ శీలంరాంబాబు, నాయకులు బానోతు వీరన్న, జిల్లా కార్యదర్శి రాధకృష్ణ, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల రాము, కౌన్సిలర్ జుర్రు రాజు, గోల్యానాయక్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సూత్రపు సరిత, మార్త సంధ్యారాణి, అచ్చ దయాకర్ పాల్గొన్నారు.

● నెక్కొండ : బీజేపీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త అంకిత బావంతో పనిచేయడంతో పాటు ప్రధాని మోదీ పాలనను గ్రామీణ ప్రజలకు తెలపాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్ కోరారు. నెక్కొండలోని శ్రీవాసవి కల్యాణ మండపంలో బుధవారం సాయంత్రం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణాప్రతాపరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రేసు శ్రీనివాస్, అధికార ప్రతినిధి శ్రీరంగం సాగర్, గుడిపూడి రాధాకృష్ణ, శ్రీరంగం శ్రీనివాస్, దామచర్ల రామారావు, సింగారపు సురేష్, నాయిని అశోక్ పాల్గొన్నారు.

వైభవంగా రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

దుగ్గొండి, ఆగస్టు 28 : మండలంలోని లక్ష్మీపురం కాలనీలో బుధవారం వైభవంగా రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. సురపానీయం కుండను గౌడ సంఘం నుంచి కక్కెర్ల శరత్‌గౌడ్ దంపతులు తీసుకొని వెళ్లగా కాలనీ వాసులు, గ్రామస్థులు డప్పు చప్పుళ్లతో మంగళ హారతులతో రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహాన్ని ఊరేగింపు చేసి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మామునూరి సుమన్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు కన్నం చిరంజీవి, సంఘం పెద్దలు తాళ్లపెల్లి రమేశ్, మామేనూరి నవీన్, రమేశ్, గౌడ సంఘం నాయకులు తొగరు విద్యాసాగర్, బొమ్మగాని రవికుమార్, బొమ్మగాని రాజబాబు, నరేందర్, లక్ష్మన్‌గౌడ్, నాగపురి మల్లయ్య, గడ్డమీది రాంబాబు, తొగరు స్వామి పాల్గొన్నారు.



రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తున్న దృశ్యం

బాధిత కుటుంబానికి రూ.5లక్షలు అందజేత



బాధిత కుటుంబానికి సాయంను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

చెన్నారావుపేట, ఆగస్టు 28 : మండలంలోని పదహారు చింతల్‌తండాలో ప్రేమోన్మాది చేసిన దాడిలో దారుణహత్యకు గురైన బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి బుధవారం రూ.5లక్షలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహాయ సహకారాలతో పార్టీ అందించిన ఆర్థిక సహాయాన్ని అందించానన్నారు. దాడిలో గాయపడిన దీపిక, మదన్‌లకు మెరుగైన వైద్యాన్ని అందించామన్నారు. ఇద్దరి చదువుల బాధ్యత తానే స్వయంగా తీసుకోవడం జరుగుతుందని కేటీఆర్ హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు పెద్ది స్వప్న, బానోతు పత్తినాయక్, రాయిడి రవీందర్‌రెడ్డి, ఎండీ.రఫీ, భూక్య శ్రీనువాస్‌నాయక్, మాజీ సర్పంచ్ బానోతు శారదగణేష్, అమ్మ రాజేష్, సాదు నర్సింగరావు. కుమారస్వామి, మురళినాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్‌సుమన్

గీసుగొండ, ఆగస్టు 28: పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేసే లా అకాడమిక్ ప్లానింగ్‌ను తయారు చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి డాక్టర్ శ్రీధర్‌సుమన్ అన్నారు. కొనాయిమాకులలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్‌డేను బుధవారం నిర్వహించారు. ముఖ్యతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకుముందు అధ్యాపకుల, విద్యార్థుల రికార్డులను పరిశీలించారు. సకాలంలో సిలబస్‌ను పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అశోక్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఓటర్‌లిస్టు మ్యాపింగ్ త్వరగా పూర్తిచేయాలి

పర్వతగిరి, ఆగస్టు 28 : ఓటర్‌లిస్టు మ్యాపింగ్ త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీవో శంకర్ నాయక్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరులిస్టు వార్డుల వారీగా, ఇళ్ల వారీగా త్వరగా మ్యాపింగ్ పూర్తిచేయాలన్నారు. అన్ని గ్రామాల్లో ప్రతీ రోజూ పారిశుధ్య పనులను చేపట్టాలని, డ్రైనేజీ కాలువలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. గ్రామాల్లో మిగిలిన మొక్కలను కూడా త్వరగా నాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాసులు, ఏపీవో సుశీల్‌కుమార్, ఈసీ రాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

గీసుగొండ, ఆగస్టు 28: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు దక్కాల్సిందేనని కేయూ అధ్యాపకుడు డాక్టర్ కె.వీరస్వామి డిమాండ్ చేశారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా బీసీలకు రిజర్వేషన్‌లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్‌గాడ్కే చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు రైతుసంఘం నాయకులు, డీబీఎఫ్ నాయకులు బుధవారం మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ కుమార్‌గాడ్కేకు ఏమైనా జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్, బీసీబహుజనఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు ధర్మపురి రామారావు, రాజేందర్, మాదాసి సురేష్, గుంటుక నర్సయ్య పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ప్రారంభం

నర్సంపేట టౌన్, ఆగస్టు 28 : పట్టణంలోని వరంగల్‌రోడ్‌లో ఏర్పాటు చేసి న బ్యాంక్ ఆఫ్ ఇండియా నర్సంపేట బ్రాంచ్ కార్యాలయాన్ని ఆ బ్యాంక్ జోనల్ మేనేజర్ శిభప్రసాద్ బిస్వల్ బుధవారం ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ వ్యాప్తంగా 71 బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లు ఉన్నాయన్నారు. 1969లో బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆవిర్భవించిందన్నారు. నర్సంపేట నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ తదితర పథకాలు, పర్సనల్ లోన్, వ్యవసాయానికి సంబంధించిన రుణాల కోసం బ్రాంచ్ అందుబాటులో ఉంటుందన్నారు. హైదరాబాద్‌లో ఉన్న జోనల్ ఆఫీస్ మాదిరిగానే వరంగల్‌లో జోనల్ ఆఫీస్‌ను త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, జోనల్ సెంటర్ మేనేజర్ పంకజ్, ఆల్ ఇండియా బ్యాంక్ ప్రెసిడెంట్ నాగేశ్వర్, కౌన్సిలర్ నాగిశెట్టి పద్మప్రసాద్, బ్రాంచ్ మేనేజర్ బానోతు శ్రీనివాస్, క్రాంతికుమార్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.